# 12

# తెలుగువీరులు

## 'బాతాల పోశెట్టి' పేరిట రాసిన కాలమ్స్

"నువు మందలియ్యకుర పొయిలుప్పేసినట్టు పెయంత సిటపటంటది."

"అసలేమైందే"

"మల్లగదేమాట, కనవడ్డోన్నల్ల నవిలి మింగాలనిపిత్తంది. నా ఎదురుంగ కూసోకుర నువ్వు"

"అత్తమీది కోపం దుత్తమీద సూపినట్టు కోపన్ బియ్యం యియ్యకపోతే నన్ను మింగుదామనుకుంటున్నవా ఏందే"

"అట్లగాదుర! ఎల్లకాలం కోపన్ బియ్యమే తినిసచ్చినమాగని అవుతల మూర్రూపాలైనై. ఈ కోపన్లు పుట్టకముందు రెండున్నరకు దొరికినై గాదుర! కండ్లు మూసుకున్నావుర?"

"ఎవడన్న పుకడుకు తాగిత్తె పూటుగ తాగచ్చినవా ఏంది? నామీద పడ్డవు?"

"నీకంటె నీకుగాదురా! ఈ సర్కారుకు కండ్లు లేవుర?"

"ఎందుకు లేవే! వెయ్యికండ్లున్నయి ఎక్కన్నో అర్ధరాత్రి గుడిసెల వన్నోన్ని లేపి నక్సలైటని కాల్సిసంపుతలేరా?"

"మరి పట్టపగలు బజాట్ల మూర్రూపాలక్కిలో అమ్మంగ ఎట్లూకుంటుందిరా"

"వేరే కోపన్లమీద రెన్నరకు కిలో సర్కారే అమ్ముతంది. గాదె"

"అంటే సర్కారే రెన్నర అమ్మంగ మనం మూడు కమ్మక పోతెట్ల అని అమ్ముతున్నరంటవు!"

"లేకపోతే మొన్న విజయవాడల జర్గిన తెలుగుదేశం సభ బియ్యం కర్సు లెట్లెల్లుతయి అనుకున్నవే?"

"నేనుగుడ గదే అనుకుంటున్నర. రాజుదల్సుకుంటె దెబ్బలకు కొదువా అని"

"అగో! నీగ్గూడ రాజకీయం మాట్లాడత్తందే"

"నీ రాజకీయమేందో కండ్లముంగట కనవడ్తలేదా! ఏం బత్కురనీది? థూ! యిజ్జతుంటె బండగట్టుకోని బాయిల వడాలె. బేయిజ్జతుబతుకెందుకురా బతికి?"

"అయ్యో! మల్ల నన్ను తిట్టవడ్తివెమ్మే"

"గీ ఎన్నుమీద, పిక్కలమీద సూర్ర! కంక కట్టెతోటి ఎట్లగొడ్తెగట్ల బర్రలైనె. నేనుజేసిన పాపమేందిర? రైతుకూలి సంగం సభకు వోదామని మందిని జమజేసుదు తప్పార?"

"తప్పెట్లయితదే? కట్టం జేసేది మనం పంటలు పండిచ్చేది మనం. మనం పని జెయ్యక పోతె కుర్చీలగూసుండి కలం గీసెటోడేగాదు లాటీలవట్టి మననుగొట్టే పోలీసోళ్లు, ఆల్లదొర ఎన్టీయారుదాక అందరికి అన్నం బెడుతున్నది మనమె. అసోంటి మనం కట్టసుకాలకోసం సభ పెట్టుకునుడు తప్పన్నోన్ని ఉరిదియ్యాలె"

"మరి గీపెయ్యన్ని దెబ్బలెట్లాయెరా?'

"రాజుదల్సుకున్నంక దెబ్బలక్కొదువా అని నువ్వే అంటివి గాదె?"

"అవు! అవు! ఎంగిలిత్తారుగూడ సుడిగాల్పుకు అంతెత్తు లేత్తది. అది ఎగిరినంతసేపు రాజుననుకుంటది. సుడిగాల్పు వోయినంక ఓ బొందల్లో ముండ్ల కంపన్లో పడుతది. గాయింత దానికి అబ్బ నీలుగుడు! లేకపోతే ఏందిర! తెలుగుదేశం మీటింగుకు లారీలు, టాక్టర్లు, బస్సులు, రైల్లు అన్ని పుక్యానికి వాడుకున్నరా లేదుర? రాత్రి, రాత్రి, అని కనవడ్డోన్నల్ల ఎక్కించుకపోయిన్రా లేదుర? మరి మన బస్సులెందుకాపిన్రుర? మననెందుకు బసులకెల్లి దించేసిన్రుర? మనమేమన్న ఆల్లతీర్గ టికటులేక వోయినాంర? గుత్తకు మాట్లాడుకున్న సర్వీసులు గుడ వట్టుకుంటార్ర. నీది సభగని మాదిగాదుర? గోసిగాల్లు గొంగడి బొంతగాల్లు మనుసులుగాదా?"

"ఔనె! మాట్లాడుకున్న సర్వీసులు పట్టుకునేసరికి రైల్ల కాజీపేట కాడ దిగినోల్లను సభకు జారేసుటానికి బసులు జాలక వెయ్యిమంది అన్నే దినంనర ఉపాసంతోటి బేజారైన్రట ఆల్లు ఆకలితోటి యిగవత్తరు అగవత్తరని రెండు వల్లాల బియ్యం అండి ఏరే పక్కకు వెట్టిన్రట సర్కారు బస్సులుగుడ యిడువ నియ్యక పోయెటాల్లకు ఆల్లేవెు అక్కడ ఉపాసం బన్నరు. ఈన్నెవెు అన్నం పారేసం డైందటనే!"

"పెద్దపల్లి కాడ నలుగురు గల్సినదువకుంట ఏందో కానూన్ వెట్టిన్రటగదర?"

"గదే 144 సెక్షన్లు, రైల్లచ్చెటోల్లంత పెద్దపెల్లి దాకత్తరని ఆల్లు సభలకు రాకుంట జెయ్యాలని వెట్టిన్రే".

"మరి బుద్ధిలేదుర? సూసెటోల్లు నోట్లూంచుతరని తెల్వదిర"

"ఎందుకు దెలువదే? అందుకే సభకు పర్మిషన్ ఇచ్చిన్రు గాదె"

"యిచ్చినోడు యిచ్చినట్టుండక గివన్ని జేసుడెందుకుర?"

"అగో! యియ్యక పోతె యిగ సాసంత్రం ఏదుందని అడుగర్ర? గందుకోసం యిచ్చిన్రు, యిచ్చినంక పెద్దెత్తున సభ జరుగుతె మన బలమెంతన్నదో లోకమంత తెలుత్తదిగాదె. మనకు బలం బాగలేదని అనుకోవాల్నంటె సభకు బాగమంది రావద్దాయె. గందుకోసం ఎన్ని జెయ్యాల్నొ గన్ని జేసిన్రు."

"కదుపుగాలినోడు ఏడికైన తెగిత్తడని తెల్వదారా ఈల్లకు?"

"ఎందుకు దెల్వది? తెల్వకనే నన్ను బాగ తిట్ట జిక్క అని సభలు రేపనంగ కల్లోలిత పాంతాల చట్టం త్వరలో ఎత్తివేస్తానని ప్రకటించిండా?"

"అయితె ఆల్లు మననుజూసి బెదిరిన్రంటవు?"

"సూసిగాదే? సూదకముందే బెదిరిన్రు. లేకపోతె గిన్ని జాగర్తలెందుకు తీసుకుంటడె?"

"ఈడ్సితన్ని తప్పైందన్నట్టు సభలైనంక బస్సులిడుసుడు! గిదేం తెలివిర?"

"గదేనే రాజకీయమంటే? గిన్ని జెయ్యంగ గూడగంత ముందచ్చెటాల్లకు ఏంజెయ్యకపోతె ఎంతమందత్తురో అని బేజారైపోయిన్రనుకోరాదు? అయితే బేజారైనట్లు మీదికి కనవడద్దాయె. గంభీరంగ ఏదో సాయం జేత్తున్నట్టు పోజు గొట్టన్నాయె మనం లేత్తె ఆల్లు తోక ముడుత్తరు మనం తోకముడిస్తె ఆల్లు లేస్తరు గిదేనే రాజకీయం అంటే?"

"ఈల్లు జేసిన చేష్టలు ఎవలకు తెలువయిర?

"గది మర్సిపోవుటానికే గాదె ఆల్ల సభ యింకింత పెద్దగ జర్గిందని పేపర్లల్ల పోటోలు యేయించుకున్నది."

"నీయక్క మనలగొట్టినట్టు అల్ల సభకచ్చెటోల్లను తౌవ్వల దొరికిచ్చుకోని జోపుదు జోపుతె ఎంతమంది మిగులుదురో తెల్సు కొడుక్కు"

"మన మీటింగైతె గింతంత రాసిన్రు పేపర్లల్ల. స్వామి అగ్నివేష్ వచ్చి మీ పాదదూళి నా నొసట ధరిస్త అని అన్నాగూడా ఈ పేపరోల్లు గింతంతనే రాసిరి".

"మన తీర్గ పన్నెండువేల మందికి రెండ్రోజులు తిండివెట్టి జరిపిన మన సభకు అందర్ని కైకిలోల్లను వెట్టి జరిపిన అల్ల సభకు పొత్తేదర? నక్కకు నాగలోకానికున్నత ఫరకు? ఈనడుమల గింత పెద్ద సభ జరిగినాదిరా?"

"జరిగితె జర్గిండచ్చుగని నయాపైసం జీతంలేకుంట వెయ్యిమంది వలంటీర్లు ఏ పనివడ్తే ఆ పనిజేసుడు మాత్రం వేరే ఎవల మీటింగుల జరుగదే? అబ్బ ఎంత పనిజేసిన్రే"

"వూరేగింపు సూత్తంటె నాకేమనిపిచ్చిందో సెప్పన్నాయె"

"ఏమనిపిచ్చిందిర?"

"ఈల్లందరికి మనిషికో తుపాకిత్తె ఎంత మంచిగుండు అన్పిచ్చిందే"

"ఔరో! అతారెలు మనకుంటె గీసర్కారు యింక వుంటాదిర, మరి యిత్తేందిర? మన పీడవోవు"

"నువ్వు నేను అనంగనె అయితదాగని! మనసొంటోల్లందరికి గిట్లనేయింక తెలజెప్పేదెంతో వున్నదే"

"గంతసేపటిదాక మనం ఏంజెయ్యాలెరా?"

"గిట్లనే అన్యాయాలకు వ్యతిరేకంగ కొట్లాడుకుంటబోవాల్నె"

"ఎంత ఓపికరా నీకు! సుడిగాలికి లేసిన యిత్తారు ఎంతసేపుంటదంటవు? అబ్బ! సులుక్కుసులుక్కు మంటన్నయి దెబ్బలు కొంచెం గిదీంతోటి కాపుర!"

"అల్లకు సభలకు స్వీట్లు కమ్మటి తిండివెడ్తె మనకు అల్లుగివ్వి వడ్డించిన్రు, ఓడలుబండ్లుగావా? బండ్లువోడలుగావా?"

**'చాటింపు' పక్ష పత్రిక 1983**